సాక్షి ఒడిశా

సోమవారం। 7। జులై। 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ. 4,63,957

బంగారం: 9 గ్రాముల 900 మిల్లీ గ్రాములు

వెండి: 15 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



వరద నీరు విడుదల

భువనేశ్వర్: ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షపాతంతో హిరాకుడ్ జలాశయంలో చేరిన వరద నీటిని ఆదివారం అధికారులు విడుదల చేశారు. తొలుత 12 గేట్లు తెరిచి నీటిని విడుదల చేశారు. తదుపరి మరో 8 గేట్లు తెరిచారు. ఎడమ వైపు 13, కుడి వైపున 7 గేట్లు తెరిచారు.

న్యూస్‌రీల్

మాజీ మంత్రి జాదవ మజ్జికి ఘన నివాళులు



చందాహండిలో జాదవ మజ్జి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేడీ కార్యకర్తలు

కొరాపుట్: దివంగత మంత్రి జాదవ మజ్జి 75వ జయంతి ఘనంగా జరిగింది. నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి సమితి కేంద్రంలో అతని విగ్రహానికి అభిమానులు ఆదివారంగా ఘనంగా నివాళులర్పించారు. దివంగత ముఖ్యమంత్రి బీజూ పట్నాయక్ హయాంలో జాదవ మజ్జి గనుల శాఖా మంత్రిగా పని చేశారు. తదనంతరం బీజూ తనయుడు మాజీ ముఖ్యమంత్రి హయాంలో జాదవ మజ్జి కుమారుడు రమేష్ మజ్జి మంత్రిగా పని చేశారు. నివాళులర్పించిన వారిలో జాదవ మజ్జి తనయులు.. మాజీ మంత్రి రమేష్ మజ్జి, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ మజ్జి, బీజేడీ కార్యకర్తలు ఉన్నారు.

గజపతి పర్యాటకంపై డాక్యుమెంటరీ విడుదల



'మన గజపతి' అనే డాక్యుమెంటరీని ఆవిష్కరించిన కలెక్టర్ దాస్

పర్లాకిమిడి: స్థానిక రాజవీధి శ్రీజగన్నాథ మందిరం వద్ద అడపా మందిరం వద్ద ఆదివారం బహుడా రథయాత్ర పురస్కరించుకుని కళాకారులతో ఒడిస్సీ నృత్య కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ విచ్చేశారు. అనంతరం మోహానా బ్లాక్ కు చెందిన సుజ్ఞాన్ సాగర్ 'మొ గజపతి' అనే పర్యాటకానికి సంబంధించిన డాక్యుమెంటరీ సీడీని జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ ఆవిష్కరించారు. ఈ డాక్యుమెంటరీలో గజపతి పర్యాటక ప్రాంతాల గురించి సవివరంగా సుజ్ఞాన్ సాగర్ మీడియా ప్రతినిధి చిత్రీకరించారు. కార్యక్రమంలో ఉపాంత ప్రహరీ పూర్ణచంద్ర మహాపాత్రో, బినోద్ జెన్నా, సంగీత దర్శకులు రఘునాథ్ పాత్రో, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్ పాల్గొన్నారు.

పుట్టగొడుగులు తిని ఐదుగురికి అస్వస్థత



ఆస్పత్రిలో బాధితులు

కొరాపుట్: పుట్ట గొడుగులు కూర తిని ఐదుగురు అస్వస్థతకు గురయ్యారు. నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి గంజా పర గ్రామ పంచాయతీ మరంగ్‌పాలిలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఇంటి ముందు గడ్డిలో ఉదయం వేల పుట్ట గొడుగులు కనిపించాయి. వీటిని స్థానికులు సేకరించి వండుకొని తిన్నారు. అయితే కొద్దిసేపటి తరువాత వారికి వాంతులు, తల తిప్పడం ప్రారంభం అయింది. వెంటనే గ్రామస్తులు వారిని రాయిఘర్ ప్రభుత్వ వైద్యశాలకి తరలించి చికిత్స అందించారు. బాధితులు ఒకే కుటుంబానికి చెందిన కువాన్ గొండో, బలరాం గొండో, దినేష్ గొండో, శివలాల్ గొండో, బుదురాం గొండోగా గుర్తించి. అయితే వీరి పరిస్థితి విషమంగా ఉండగా.. మరో ముగ్గురు కోలుకున్నారని వైద్యులు ప్రకటించారు.

నందపూర్ రథయాత్రకు అవాంతరాలు



నందపూర్‌లో ఇంటిని ఢీ కొన్న రథం



రథం ఢీకొట్టడంతో కూలిన గోడ

కొరాపుట్: రాజరిక నేపథ్యం ఉన్న కొరాపుట్ జిల్లా నందపూర్ రథయాత్రలో బహుడా రోజు అవాంతరాలు ఏర్పడ్డాయి. రథం లాగడంలో దిశ మారి రథం ఒక ఇంటి వైపునకు దూసుకెళ్లి నిలిచిపోయింది. అనంతరం ప్రజలు చాలా శ్రమ పడి సవ్య దిశలోకి తెచ్చారు. మరి కొంత దూరం వెళ్లి మరో షాపు వద్ద మొరాయించింది. ప్రజలు ఎంత కష్టపడినా ముందుకు కదల్లేదు. దీంతో జేసీబీ తెచ్చి కదిలించారు. అంతలోనే భారీ వర్షం పడడంతో ప్రజలు చెల్లాచెదురయ్యారు. చివరకు ఎంతో కష్టం మీద రథం జగన్నాథ మందిరానికి చేరింది. ఈ ఘటనలో ఒక ఇంటి గోడ కూలి పోయింది. రథం నుంచి కొన్ని భాగాలు విడవడ్డాయి.



బంగారు స్వామి

- శ్రీ క్షేత్రంలో హరి శయన ఏకాదశి



రథాలపై మూల విరాట్ల స్వర్ణాలంకార దర్శనం కోసం తరలి వచ్చిన భక్త జనం

భువనేశ్వర్: శ్రీ క్షేత్రంలో ఆషాఢ శుక్ల ఏకాదశి పుణ్య తిథి అత్యంత ప్రాముఖ్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా పూరీ శ్రీ మందిరం భక్త జనంతో కిటకిటలాడింది. వేకువ జాము నుంచి ప్రత్యేక పూజాదులతో స్వామి పలుమార్లు ఆకర్షణీయమైన అలంకరణతో శోభిల్లాడు. హరి శయన ఏకాదశి పురస్కరించుకుని రథాలపై దేవుళ్లకు 2 సార్లు బొడొ సొంగారొ అలంకరణ చేయడం విశేషం. ఈ సందర్భంగా రథాలపై మూల విరాటుల్ని స్వర్ణ అలంకారంలో దర్శించుకుని భక్తులు తరించారు.

శ్రీ క్షేత్ర వాసుడు శ్రీ జగన్నాథుని వార్షిక రథ యాత్ర దాదాపు అంతిమ దశకు చేరుకుంది. స్వామి యాత్ర ఆద్యంతాలు భక్త జనాన్ని మురిపిస్తాడు. పవిత్ర ఆషాఢ శుక్ల ఏకాదశి పుణ్య తిథి పురస్కరించుకుని భక్తులకు బంగారు శోభతో దర్శన భాగ్యం కల్పించాడు. శ్రీ మందిరం సింహ ద్వారం ఆవరణలో 3 రథాలపై దేవుళ్లని బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఈ సందర్భంగా శ్రీ మందిరం సింహ ద్వారం ప్రాంగణంలో పతిత పావనునికి బంగారు అలంకరణ చేశారు.

రత్న వేదికపై నిత్యం అసంపూర్ణ దారు విగ్రహాలుగా దర్శనం ఇచ్చే మూల విరాటులు రథ యాత్రలో రథాలపై బంగారు తొడుగులు, ఆభరణాలతో నిలువెత్తు రూపంతో దర్శనం ఇస్తారు. కుల, మత, వర్గ, వర్ణ వివక్షకు అతీతంగా ఆరు బయట పరిపూర్ణ జగన్నాథుని దర్శించుకునే అపురూప అవకాశం స్వామి రథ యాత్రలో మాత్రమే సాధ్యం అవుతుంది. ఈ ఏడాది రాత్రి 11 గంటల వరకు రథాలపై మూల విరాటుల పరిపూర్ణ రూపాన్ని బంగారు అలంకరణలో దర్శించుకునే అవకాశం కల్పించారు. ఆదివారం సాయంత్రం సుమారు 5 గంటల నుంచి ఈ దర్శనం ప్రారంభం కావడం విశేషం.

శ్రీమందిరంలో హరి శయన ఏకాదశి

ఆషాఢ శుక్ల ఏకాదశి సందర్భంగా రథాలపై దేవుళ్ళకు హరి శయన ఏకాదశి ప్రత్యేక పూజాదులు నిర్వహించారు. నేటి నుంచి కార్తీక మాసం శుక్ల పక్ష ఏకాదశి రోజు వరకు భగవంతుడు 4 నెలలు శయనిస్తాడు.

వల్లభ్ల బొడొ సింగారో అలంకరణ

పవిత్ర హరి శయన ఏకాదశి పురస్కరించుకుని రథాలపై మూల విరాటులకు వరుసగా 2 సార్లు బొడొ సింగారొ అలంకరణ చేయడం ఆచారం. నిత్యం సాగే బొడొ సింగారొ అలంకరణ తర్వాత భోగ సేవ తర్వాత అధిక భోగ సేవ నిర్వహించి మరో మారు బొడొ సింగారొ అలంకరణ చేస్తారు.దీన్ని వల్లభ బొడొ సింగారొ అలంకరణగా పేర్కొంటారు.



శ్రీ జగన్నాథుని బంగారు కాళ్లు, చేతులు

ఏటా 5 సార్లు బంగారు శోభతో దర్శనం

ఏటా రథ యాత్ర పురస్కరించుకుని మారు యాత్ర (బహుడా)లో భాగంగా ఆషాఢ శుక్ల ఏకాదశి తిథి నాడు రథాలపై బహిరంగంగా అన్ని వర్గాల భక్తులకు స్వామి బంగారు దర్శనం ఒక రోజు లభిస్తుంది. ఏడాదిలో మరో 4 సార్లు శ్రీ మందిరం లోపల మూల విరాటులు బంగారు అలంకరణతో శోభిల్లుతారు. ఏటా కార్తీక పూర్ణిమ, పౌష్య పూర్ణిమ, డోల పూర్ణిమ, అశ్విని శుక్ల దశమి పుణ్య తిథుల్లో స్వామి బంగారు శోభతో భక్తులకు మిరిమిట్లు గొలిపిస్తాడు. పుష్యాభిషేకం సందర్భంగా పుష్య మాసం పౌర్ణమి నాడు, దసరా ఉత్సవాల్లో విజయ దశమి నాడు స్వర్ణ శోభితుడుగా దర్శనం ఇస్తాడు. శ్రీ మందిరం రత్న వేదికపై ఆయా తిథుల్లో మధ్యాహ్న ధూపం తర్వాత మూల విరాటుల్ని బంగారు ఆభరణాలతో అలంకరించడం ఆచారంగా కొనసాగుతోంది. దసరా సమయంలో విజయ రామచంద్రునిగా, కార్తీక పౌర్ణమి సమయంలో ద్వారక నాథునిగా, డోల పౌర్ణమి సమయంలో గోపేశ్వరుడిగా, పుష్యాభిషేకం సమయంలో శ్రీరామునిగా పూజిస్తారు.





శ్రీ జగన్నాథుని బంగారు చక్రం, వెండి శంఖం



శ్రీ మందిరం రత్న భాండాగారం నుంచి తరలిస్తున్న బలభద్ర స్వామి, దేవీ సుభద్ర బంగారు మకుటాలు



శ్రీ మందిరం సింహ ద్వారం ప్రాంగణంలో బంగారు కిరీటంతో పతిత పావనుడు

మూడు రథాల వద్ద కోలాహలం



మవుసీ ఘోరొలో విడిదిచేసిన శ్రీజగన్నాథ రథాలు

పర్లాకిమిడి: గుండిచా మందిరం నుంచి బయలుదేరిన శ్రీజగన్నాథ, బలభద్ర, సుభద్ర రథాలు శనివారం రాత్రి మార్గం మధ్యలో మవుసీ ఘోరో (పిన్నతల్లి) ఇంటి వద్ద విడిది చేశాయి. ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున రథాలపై ఉన్న జగన్నాథ, బలభద్ర, సుభద్రలను దర్శించుకున్నారు.



బలభద్రుని రథం వద్ద భక్తుల కోలాహలం

అనుమతి లేని దుకాణాల కూల్చివేత



కూల్చివేతలు పర్యవేక్షిస్తున్న సబ్ కలెక్టర్ ఆకవరం సశ్యరెడ్డి



మాంసాహార దుకాణాలు కూల్చి వేస్తున్న దృశ్యం

కొరాపుట్: పాఠశాలల పరిసరాల్లో పారిశుధ్యానికి జయపూర్ సబ్ కలెక్టర్ ఆకవరం సశ్యరెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇందులో భాగంగా కొరాపుట్ పట్టణంలోని ఎన్‌కేటీ రోడ్డు చివర బాయ్స్ హైస్కూల్ ప్రాంతంలో కఠిన చర్యలకు దిగారు. అక్కడ అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న మాంసాహార దుకాణాలను ఆదివారం కూల్చి వేశారు. వీటి నిర్వహణ వలన తీవ్ర దుర్గంధం ఏర్పడి బాలలు అనారోగ్యం పాలవుతున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సబ్ కలెక్టర్ స్వయంగా రంగంలో దిగి కూల్చివేతలు పర్యవేక్షించారు. కార్యక్రమంలో పోలీసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అతిసారం కేసులు నమోదు కాలేదు

- రాష్ట్ర ఆరోగ్య శాఖ బృందం వెల్లడి



టికిరపడ గ్రామస్తులతో మాట్లాడుతున్న వైద్య బృందం సభ్యులు

రాయగడ: జిల్లాలోని ఏ ప్రాంతాల్లో అతిసార వ్యాధి కేసులు నమోదు కాలేదని వైద్య బృందం స్పష్టం చేసింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో అతిసార ప్రబలినట్టు వచ్చిన వార్తల నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్యశాఖకు చెందిన డాక్టర్ మదన్ మోహన్ ప్రధాన్ నేతృత్వంలో జాతీయ స్వస్థ్య మిషన్ రాష్ట విభాగానికి చెందిన కన్వీనర్ అద్వేత్ ప్రధాన్, గ్రామీణ నీటి సరఫరా విభాగం చీఫ్ ఇంజినీర్ (భువనేశ్వర్) నారాయణ ప్రధాన్ గాంధీ, ల్యాబ్ అసిస్టెంట్ అబీన్ కుమార్ బొరల్‌ల బృందం జిల్లాలో రెండు రోజులు పర్యటించింది. సదరు సమితిలోని కూలి, కందిలి, పితామహల్, కొలనార సమితిలోని సూరి తదితర ప్రాంతాల్లో పర్యటించిన వైద్యబృందం అక్కడి గ్రామస్తులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీటి సరఫరా ప్రాంతాలను పరిశీలించారు. అయితే ఆయా ప్రాంతాల్లో మలేరియా, అతిసార ప్రబలినట్టు వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి మలేరియా, డెంగీ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరిలోని కొరాపుట్ వీధి, జొడియా వీధి, హరిజన్ వీధులతోపాటు టికిరపడ, మైకంచ్, దుదుకాబహాల్, శంకరడ గ్రామాల్లో పర్యటించిన బృందం అక్కడి పరిస్థితిని అధ్యయనం చేశారు. జిల్లాలో ఎక్కడా అతిసారం సోకలేదని అదే విధంగా మలేరియా, డెంగీ వ్యాధులు అదుపులో ఉన్నట్లు వెల్లడించారు. ప్రజలు అప్రమత్తగా ఉండాలని ఎటువంటి అనారోగ్యానికి గురైతే వెంటనే సమీపంలోని ఆస్పత్రి వైద్యులను సంప్రదించాలని సూచించారు.

డోలీలే గతి



బొయిపరిగుడ సమితిలో మహిళా రోగిని డోలీ మీద ఆస్పత్రికి చేరుస్తున్న గిరిజనులు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా జయపూర్ సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి బోడపు పుట్ గ్రామ పంచాయతీ సునా గుడ గ్రామానికి చెందిన మహిళలు వెదురు కర్రల కోసం అడవిలోకి వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో సబితా పంగి, లక్ష్మీ ఖొర అనే మహిళలు వెనుకబడ్డారు. వీరిద్దరూ కలసి వస్తున్న సమయంలో పులి గాండ్రింపు శబ్దం వినిపించింది. దాంతో తీవ్ర భయకంపితులయ్యారు. ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దెయ్యం పట్టిందనే అనుమానంతో గిరిజనులు మంత్ర గత్తెలను రప్పించి పూజలు చేశారు. అయినా వారిద్దరి పరిస్థితి పూర్తిగా దిగజారింది. దీంతో వారిద్దరినీ బొయిపరిగుడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని ప్రయత్నం చేశారు. గ్రామానికి రోడ్డు సదుపాయం లేకపోవడంతో కుర్చీలను డోలీలుగా మార్చారు. వాగులు, అడవులు, కొండలు దాటి కట్పడ గ్రామానికి చేరుకున్నారు. అక్కడకు కూడా అంబులెన్స్ రాలేదని సిబ్బంది చెప్పడంతో గెంద్ర గుడ వరకు బైక్‌ల మీద తీసుకొని వెళ్లారు. అక్కడ నుంచి అంబులెన్స్ ద్వారా బొయిపరిగుడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భారీ వర్షంలో బాధిత మహిళలను డోలీల మీద తీసుకుని రావడం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. బాధిత గ్రామానికి రోడ్డు వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



అధికారులతో సీజనల్ వ్యాధులపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పట్వారి తదితరులు

రాయగడ: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై సంబంధిత శాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశం హాల్‌లో ఈ మేరకు శనివారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ డెంగీ, మలేరియా, అతిసారం వంటి వ్యాధులు అత్యధిక శాతం ప్రబలే అవకాశం ఉన్నందున వాటిని సమర్థంగా ఎదుర్కొనే విధంగా ఆరోగ్య శాఖ ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అధిక దృష్టి సారించాలని అన్నారు. జిల్లాలోని ప్రత్యేక అంగన్‌వాడి, ఆశ కేంద్రాల్లో సరిపడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందేవిధంగా అవసరమయ్యే మందులను అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. గ్రామంలో ప్రతి సమాచారాన్ని ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆరోగ్య శాఖకు అందించాలని సూచించారు. సమావేశంలొ ఏడీఎంఒ డాక్టర్ మమత చౌదరి, జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ బి.సరోజిని దేవి, జిల్లా అదనపు ముఖ్యవైద్యాధికారి డాక్టర్ సుబుద్ధి, జిల్లా అదనపు కలక్టర్ రమేష్ చంద్ర నాయక్, ఏడీఎంఒ డాక్టర్ మమత సాహు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దేవతామూర్తులకు పూజలు


పూజలందుకున్న దేవతామూర్తులు

రాయగడ: గుండిచా మందిరం నుండి జగన్నాథ మందిరానికి తరలివచ్చిన దేవతామూర్తులు జగన్నాథ, బలభద్ర, శుభద్ర దేవిలు ఆదివారం సునాబొజేలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఏకాదశి పర్వదినం కావడంతో రథాలపై దేవతామూర్తులను ఉంచి అలంకరించారు. ఈ సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన బందొస్తును ఏర్పాటు చేసారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు


సత్యనారాయణ వ్రత పూజలను నిర్వహిస్తున్న భాస్కరాచార్యులు

రాయగడ: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక బాలాజీనగర్‌లో గల కళ్యాణ వేంకటేశ్వర మందిరంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి సుప్రభాత, అభిషేక కార్యక్రమాలతోపాటు రమాసత్యనారాయణ వ్రత పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టణ బీజేడీ అధ్యక్షునిగా ప్రమోద్ కుమార్


నబరంగ్‌పూర్ బీజేడీ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ రథ్

కొరాపుట్: నబరంగ్‌పూర్ పట్టణ బీజేడీ అధ్యక్షునిగా ప్రమోద్ కుమార్ రథ్ నియమితులయ్యారు. బీజేడీ పార్టీ నబరంగ్‌పూర్ జిల్లా ఎన్నికల రిట్నరింగ్ అధికారి సచింద్ర స్వయ్ ఆదివారం తెలియజేశారు. ప్రమోద్ కుమార్‌కు ఈ పదవి వరుసగా ఐదో సారి ఎన్నికయ్యారు. ప్రమోద్‌కు పార్టీ మాజీ ఎంపీలు రమేష్ మఝి, ప్రదీప్ మఝి, పార్టీ జిల్లా అధ్యక్షుడు మనోహర్ రంధారి, మాజీ ఎమ్మెల్యే సదాశివ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పదవీ కాలం మూడేళ్లు ఉండనుంది.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను, పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ (1938) జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీకాకుళంలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘ జిల్లా అధ్యక్షుడు బి.రవి అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. నాడు–నేడుతో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తిచేయాలని కోరారు. పేరెంట్ టీచర్ మీటింగ్‌ల పేరిట బడుల్లో విలువైన కాలాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు. గిన్నిస్‌రికార్డుల కోసం ఆరాటమే తప్ప విద్యాభివృద్ధి పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా పూర్వ అధ్యక్షులు టి.చలపతిరావు, ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, బాలాజీరావు, ఆర్.వి.అనంతాచార్యులు, బి.నవీన్, కృష్ణారావు, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిపై ట్రోలింగ్ తగదు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డిపై సోషల్ మీడియాలో తప్పుడు ట్రోలింగ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని శ్రీకాకుళం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వతంత్ర ప్రతిపత్తి గల న్యాయవ్యవస్థలో భాగమైన ఉన్నత న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తున్నా ట్రోలింగ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు.వ్యక్తి కంటే వ్యవస్థలే ముఖ్యమని, అటువంటి వారిని అవమానిస్తే, న్యాయవ్యవస్థను అవమాన పరిచినట్లేనని పేర్కొన్నారు. ట్రోల్ చేస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించించాలని కోరారు.

ఉత్సాహంగా చెస్ ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో రాణించి జిల్లాకు పేరుతీసుకురావాలని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బగాది కిషోర్ ఆకాంక్షించారు. జిల్లాస్థాయి అండర్–15 చెస్ ఎంపిక పోటీలు ఆదివారం ఉత్సాహభరితంగా సాగాయి. జిల్లా నలుమూలల నుండి క్రీడాకారులు పాల్గొని ఎత్తుకు పైఎత్తులేశారు. బాలుర విభాగంలో డొంకాడ కార్తికేయ ప్రథమ, బొల్ల యశ్వంత్ ద్వితీయ, ఎస్‌కేపీ నిహాల్ తృతీయ, పొన్నాడ వేదిష్ నాలుగో స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో మెట్ట తీక్షణ, బొల్ల శృతి, జామి వినమ్ర, రిత్వికతొలి నాలుగు స్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



ఒడిశాను విద్యా హబ్‌గా మార్చుతాం

- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

జయపురం: బహుళ ఆదివాసీ అవిభక్త కొరాపుట్‌ను విద్యా రంగంలో ఉన్నతంగా తీర్చిదిద్దుతామని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. కొరాపుట్ జిల్లాలో రెండు దినాల పర్యటన సందర్భంగా ఆదివారం జయపురంలో మూడు గంటలు పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొరాపుట్ నుంచి ఆయన నేరుగా జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గల సమగ్ర ఆదివాసి అభివృద్ధి ఏజెన్సీ విభాగ భవనాల్లో తాత్కాలిక జయపురం కేంద్ర విద్యాలయాన్ని ప్రారంభించారు. అక్కడ మొక్క నాటిన అనంతరం ఆయన విద్యాలయ అధికారులతో చర్చలు జరిపారు. అక్కడ నుంచి ఆయన విక్రమదేవ్ విశ్వవిద్యాలయానికి వెళ్లి విద్యాధికారులతో విశ్వవిద్యాలయ ప్రగతిపై చర్చలు జరిపారు. అనంతరం ఆయన జయపురం–మల్కన్‌గిరి మార్గంలో గ్లోకల్ హాస్పిటల్ సమీపంలో జయపురం కేంద్ర విద్యాలయ నిర్మాణానికి ఎంపిక చేసిన 8 ఎకరాల విశాల ప్రాంతంలో జయపురం కేంద్ర విద్యాలయ శాశ్వత నూతన భవనాలకు భూమి పూజ చేశారు.


ప్రసంగిస్తున్న కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రదాన్

ఈ సందర్భంగా కేంద్ర విద్యామంత్రి ప్రసంగిస్తూ ఒడిశాను విద్యారంగంలో ఉన్నత స్థాయికి తీసుకువెళ్లేందుకు కేంద్రం కృత నిశ్చయంతో ఉందని వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్నత విద్యాసంస్థలు కేంద్రియ ఒడిశా విశ్వవిద్యాలయం, ఐఐటి భువనేశ్వర్, ఐఐఎం సంబల్‌పూర్, ఎన్‌ఐటి రూర్కెలా, కేంద్రీయ విశ్వ విద్యాలయం పూరీ, ఐఎస్ఎర్ బరంపురంలకు కేంద్రం చేయూతనిస్తోందని వెల్లడించారు. కార్యక్రమాలలో ఒడిశా రాష్ట్ర విద్యామంత్రి నిత్యానంత గోండ్, మత్స్య,పశుసంపద విభాగ మంత్రి గోకులానంద మల్లిక్, ఉన్నత విద్యామంత్రి


కేంద్రీయ విద్యాలయ విద్యార్థులతో మంత్రులు తదితరులు

సూర్యవంశీ సూరజ్, జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, పొట్టంగి ఎమ్మెల్యే రామచంద్ర కడమ్, కొరాపుట్ ఎమ్మెల్యే రఘునాథ్ మచ్చ, నవరంగపూర్ ఎమ్మెల్యే గౌరీశంకర మఝి, కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భొత్ర, నవరంగపూర్ ఎంపీ బలభద్ర మఝి, కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర ఉల్కా, కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాస్, జయపురం సబ్ కలెక్టర్ కుమారి అక్కవరం శొశ్యా రెడ్డి, జయపురం కేద్ర విద్యాలయ ప్రిన్సిపాల్ లతో పాటు పలువురు అధికారులు, బిజేపి నాయకులు, పాల్గొన్నారు.

జగన్నాథుడికి ప్రత్యేక పూజలు

పర్లాకిమిడి: రాజవీధిలో నిలుపుదల చేసిన జగన్నాథ, బలభద్ర, సుభద్ర రథాల మీద తొలి ఏకాదశి సందర్భంగా జగన్నాథుడు ప్రత్యేక వేషధారణలో ఆదివారం భక్తులకు దర్శనం కల్పించారు. బలభద్రుడు, చెల్లెలు సుభద్ర సునాబేషో (బంగారు తోడుగులు) అలంకరణలో ఉండటంతో పోలీసులు పెద్ద ఎత్తున పహారా కాస్తున్నారు. సాయంత్రం హారతి సమయంలో ఈ సునాభోషోలో చతుర్థామూర్తులు భక్తులకు దర్శనం కల్పించారు. ఒక్కరోజే 50 వేల మంది భక్తులు జగన్నాథుని సునాభేషోను దర్శించుకోవడానికి విచ్చేశారు.


బంగారు తోడుగులతో సుభద్ర


బంగారు తోడుగులతో బలరాముడు


ప్రత్యేక వేషధారణలో జగన్నాథుడు

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలిగా మీనాక్షి బాహిణీపతి

కొరాపుట్: మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలిగా కొరాపుట్ జిల్లాకు చెందిన మీనాక్షి బాహిణీపతి నియమితులయ్యారు. ఆదివారం రాత్రి కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా ఎక్స్ వేదికగా ప్రకటించారు. రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సూచనతో మీనాక్షిని నియమిస్తున్నట్లు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ఎంపీ వేణుగోపాల్ ప్రకటించారు. మీనాక్షి ఈ పదవిని రెండో సారి చేపట్టనున్నారు. మీనాక్షి గతంలో కొరాపుట్ పురపాలక సంఘానికి రెండు సార్లు చైర్పర్సన్ పని చేశారు. మీనాక్షి భర్త తారా ప్రసాద్ బాహిణీపతి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిపొందారు. ప్రస్తుతం జయపూర్ ఎమ్మెల్యేగా, ప్రదేశ్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. మీనాక్షి మరిది భగవాన్ బాహిణీపతి గతంలో కొరాపుట్ పురపాలక సంఘ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షునిగా గెలిపొందారు. భగవాన్ ప్రస్తుతం కొరాపుట్ జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ఈ ప్రకటనతో బాహిణీపతి కుటుంబం కాంగ్రెస్ పార్టీ ప్రబాల్యం పరిపూర్ణమైంది.


మీనాక్షి బాహిణీపతితో భర్త, జయపూర్ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షుడు తారాప్రసాద్ బాహిణీపతి

యువకుడు దారుణ హత్య

- ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద బాకీ విషయమై గొడవ
- కత్తితో దాడికి పాల్పడిన షాపు నిర్వాహకుడు
- వసపలో విషాద ఛాయలు


లుకలాపు మిన్నారావు (ఫైల్)


మిన్నారావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ ప్రసాదరావు, క్లూస్ టీమ్

కొత్తూరు: బాకీ విషయమై తలెత్తిన వివాదం ఓ యువకుడి హత్యకు దారి తీసింది. ఈ విషాద ఘటన కొత్తూరు మండలం వసప గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వసప గ్రామంలో మలగాన శంకర్ అనే వ్యక్తి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్నాడు. ఇతనికి అదే గ్రామానికి చెందిన లుకలాపు మిన్నారావు(19) అనే యువకుడు బాకీ ఉన్నాడు. ఎప్పుడు వీరిద్దరూ కలిసిన బాకీ విషయమై గొడవ జరిగేది. తన డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తానని శంకర్ తరచూ బెదిరించేవాడు. ఈ క్రమంలో మిన్నారావు శనివారం రాత్రి పకోడీ కొనేందుకు శంకర్ షాపు వద్దకు వెళ్లాడు. ఇంతవరకు ఉన్న బాకీ తీర్చాలని శంకర్ అడగడంతో ఇద్దరి మధ్య వివాదం జరిగింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో కొట్లాటకు దారితీసింది. ఈ క్రమంలో శంకర్ షాపులో ఉన్న సుత్తితో మిన్నారావు తలపై బలంగా కొట్టాడు. దీంతో మిన్నారావు కిందపడిపోయాడు. కొనఊపిరితో రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతుండగా చాకుతో గొంతు కోసి హత్య చేశాడు. మృతదేహాన్ని షాపు ఎదురుగా ఉన్న పీహెచ్ రోడ్డు పక్కన పడేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం వేకువజామున రోడ్డు పక్కన మిన్నారావు మృతదేహం కనిపించడంతో అటు వైపు వైపు వెళ్లిన స్థానికులు గుర్తించి మృతుడి లుకలాపు బుడ్డు, లక్ష్మిలకు తెలియజేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. ఒక్కగానొక్క కుమారుడు విగతజీవిగా కనిపించడంతో విషాదంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న సీఐ చింతాడ ప్రసాదరావు, ఎస్ఐ ఎండీ ఆమీర్ ఆలీ సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి బుడ్డు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆమీర్ ఆలీ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

నందిగాం: రాంపురం పంచాయతీ జయపురం గ్రామానికి చెందిన రాంపురం రత్నాలు(54) అనే వివాహిత పురుగుల మందు తాగి ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రత్నాలుకు కంటి సమస్యతో బాధపడుతోంది. భర్త మహేష్ విశాఖపట్నం ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రికి తీసుకువెళ్లి అన్ని పరీక్షలు చేయించినా ఫలితం లేకపోయింది. దీంతో మనస్థాపం చెందిన శనివారం అర్ధరాత్రి పురుగుల మందు తాగింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. భర్త మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ కన్నారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొరాపుట్‌లో కేంద్రమంత్రి సుడిగాలి పర్యటన

- హిందూస్థాన్ ఏరోనాటిక్స్ సందర్శన
- అమ్మవారికి ప్రత్యేక పూజలు


కొంటాబంశీ అమ్మవారి దర్శనానికి వెళ్తున్న కేంద్రమంత్రి, కలెక్టర్, ఎంపీ బలబద్రలు


హాల్ సాంకేతిక సిబ్బందితో మంత్రి ధర్మేంద్ర


సునాబెడాలో కేంద్ర మంత్రి ధర్మేంద్రకు స్వాగతం పలుకుతున్న మున్సిపల్ చైర్మన్ రాజేంద్ర పాత్రో


సునాబెడాలోని హాల్‌ని పరిశీలిస్తున్న దృశ్యం

కొరాపుట్: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్ కొరాపుట్ జిల్లాలో ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. రైలులో కొరాపుట్ జిల్లా దమంజోడి వద్ద దిగిన ఆయనకు రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖ మంత్రి నిత్యానంద గోండో, ఉన్నత విద్యాశాఖ మంత్రి సూరజ్ సూర్య వంశీ, ఎంపీలు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. దమంజోడిలోని కొంటాబంశీ అమ్మవారిని కేంద్రమంత్రి ధర్మేంద్ర దర్శించుకున్నారు. జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్ మంత్రికి దేవాలయం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం మంత్రికి దారి పొడుగునా ప్రజలు, కార్యకర్తలు స్వాగతం పలికారు. సునాబెడ వద్ద బీజేడీకి చెందిన మున్సిపల్ చైర్మన్ రాజేంద్ర కుమార్ పాత్రో నృత్యాలు చేస్తూ మంత్రికి స్వాగతం పలకడంతో బీజేపీ నాయకులు ఆసక్తిగా గమనించారు. అనంతరం హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)ని సందర్శించారు. అక్కడ సుఖోయ్, మిగ్ యుద్ధ విమానాల ఇంజిన్ల తయారీ విధానాన్ని రక్షణ శాఖ ఇంజినీర్లు కేంద్రమంత్రికి వివరించారు. హాల్ వలన స్థానిక యువతకి ఉపాధి అవకాశాలపై మంత్రి ఆరా తీశారు. అక్కడ జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. నబరంగ్‌పూర్ ఎంపీ సప్తగిరి ఉల్కా, ఎమ్మెల్యేలు గౌరీ శంకర్ మఝి, రుపుదర్ బోత్ర, నర్సింగ్ బోత్ర, రఘురాం మచ్చో, పలువురు బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.


దమంజోడి వద్ద సాయుధ దళాల గౌరవ వందనం

డిగ్రీ ప్రవేశాలకు మోక్షమెప్పుడో


శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల

- ఇంటర్ ఫలితాలు విడుదలై మూడు నెలలు
- కనీసం దరఖాస్తులు చేసుకోవడానికి సైతం షెడ్యూల్ విడుదల చేయని వైనం
- విద్యార్థుల భవితవ్యంతో ఆటలాడుకుంటున్న కూటమి సర్కారు


తరగతి గదిలో డిగ్రీ విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలై మూడు నెలలు గడిచాయి. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు సైతం విడుదలై నెల రోజులైంది. అయినా డిగ్రీ ప్రవేశాలకు మాత్రం మోక్షం కలగడం లేదు. కూటమి ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోకపోవడంతో ప్రవేశాల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలలో ఉన్నత విద్యాశాఖ తీవ్ర జాప్యం చేస్తోంది. గత ఏడాది ఇలాగే ఆలస్యంగా అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టడంతో ప్రభుత్వ కళాశాలల్లో వందలాది సీట్లు మిగిలిపోయాయి. ఈ ఏడాది అంతకుమించిన దుస్థి తి తలెత్తుతుండటంతో కళాశాలల యాజమాన్యాలు గగ్గోలు పెడుతున్నాయి. మరోవైపు డిగ్రీలో చేరాలనుకుంటున్న విద్యార్థులు అయోమయంలో ఉన్నారు. కొంత మంది ప్రైవేటు కోర్సుల బాట పడుతున్నారు.

ఆన్‌లైనా.. ఆఫ్‌లైనా ?

ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో డిగ్రీ ప్రవేశాలను గతంలో కళాశాల యూనిట్‌గా నిర్వహించేవారు. ఎంపిక చేసిన కళాశాలల్లో విద్యార్థులు దరఖాస్తులు చేసుకుని, సీటు లభించిన కళాశాలలో చేరే వారు. ఇంటర్మీడియెట్ మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పించేవారు. 2020 నుంచి ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రం యూనిట్‌గా విద్యార్థులు వెబ్‌బేస్డ్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్లు ఇచ్చుకునేవారు. మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు లభించేవి. ప్రైవేట్ కళాశాలలో 70 శాతం కన్వీనర్, 30 శాతం మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలు నిర్వహిస్తారు. మేనేజ్‌మెంట్ సీట్లకు ప్రభుత్వ రాయితీలైన ఫీజు రీయింబర్స్‌మెంట్లు, స్కాలర్‌షిప్‌లు వంటివి వర్తించవు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ యాజమాన్యాలు పాతవిధానమైన ఆఫ్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించాలా? ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలా? అన్న అంశంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోలేకపోతోంది. ఈ జాప్యం డిగ్రీ ప్రవేశాలపై ప్రభావం చూపుతోంది. ప్రభుత్వ నిర్వాకంతో రెండేళ్లగా డిగ్రీ ప్రవేశాలు తగ్గుముఖం పడుతున్నాయనేది గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. విద్యాశాఖ మంత్రి లోకేష్ వద్ద ఫైల్ కొన్ని రోజుల తరబడి పెండింగ్‌లో ఉందన్న ప్రచారం జరుగుతోంది. లోకేష్ మిగిలిన శాఖలపై పెత్తనం చలాయిస్తుండటంతో.. తన విద్యాశాఖపై కనీసం దృష్టి పెట్టలేకపోతున్నారన్న విమర్శలకు డిగ్రీ ప్రవేశాల ఉదంతమని విద్యార్థి సంఘాల ప్రతినిదులు ఆరోపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో 103 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 15 ప్రభుత్వ, 88 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో 28 వేల సీట్లు ఉన్నాయి. కొన్నేళ్ల కిందట జిల్లా నుంచి 20 వేల వరకు సీట్లు నిండేవి. గత ఏడాది ఈ సంఖ్య పది వేలకు పడిపోయింది. కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో ప్రవేశాలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. ప్రభుత్వ కళాశాలల్లో సైతం గతంలో పోలిస్తే ఆర్ట్స్, కామర్స్ గ్రూపుల్లో ప్రవేశాలు తగ్గిపోయాయి. దీంతో కొన్ని సబ్జెక్టుల కాంబినేషన్ కోర్సులను మూసివేశారు. ప్రధానంగా బీఎస్సీ ఎంపీసీ, కంప్యూటర్స్ కోర్సులకు డిమాండ్ ఉంది. ప్రభుత్వ కళాశాలల్లో శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం వంటి కళాశాలకు డిమాండ్ ఉంది. ప్రైవేట్ కళాశాలలు తీసుకుంటే శ్రీకాకుళం నగరం, రూరల్, రాజాం, నరసన్నపేట, టెక్కలి వంటి ప్రాంతాల్లో 20 కళాశాలల్లో సీట్లకు డిమాండ్ ఉంది. ఇంజినీరింగ్ కళాశాలలు అందుబాటులో ఉండటంతో ఇంటర్ ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థులు ఇంజినీరింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనికి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా అమలు చేయడంతో విద్యార్థులు అటువైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా డిగ్రీలో ప్రవేశాల సంఖ్య తగ్గుతోంది.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి


సమావేశమైన కార్మిక సంఘాల నాయకులు

కొరాపుట్: ఈ నెల తొమ్మిదో తేదీన జరిగే సార్వత్రి సమ్మెను జయప్రదం చేయాలని వామపక్షా కార్మిక సంఘాల ఐక్య వేదిక విజ్ఞప్తి చేసింది. ఆదివారం సాయంత్రం జయపూర్ పట్టణంలోని జాతీయ రహదారి 26పై ఉన్న ఉమెన్స్ కాలేజీ సమీపంలోని శ్రామిక్ భవన్‌లో సమావేశం జరిగింది. ఇందులో సీపీఐ నాయకుడు ప్రమోద్ మహంతి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టనున్న బంద్‌ను జయప్రదం చేయాలన్నారు. రాష్ట్రంలో పని చేస్తున్న ఆశ, అంగన్‌వాడీ, వంట సహాయకులకు ఉద్యోగ హోదా కల్పించాలని, పాత పింఛన్ విధానం అమలు చేయాలని డిమాండ్లు చేశారు. వివిధ సంఘాలలో పని చేస్తున్న కార్మికులతో పాటు అసంఘటిత కార్మికులు కూడా పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, ఐఎన్‌టీయూసీ, ఈపీఎఫ్ పెన్షనర్ల అసోసియేషన్‌కు తదితర కార్మిక సంఘాలకు చెందిన జుదిష్ట రావులో, సుభాష్ బట్టాచార్య, ఉత్తం నాయక్, కె.భగవాన్‌రెడ్డి పాల్గొనారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

పర్లాకిమిడి: స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం మహేంద్రాంచల్ ఇకో క్లబ్ ప్రతినిధులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మోనాలిసా దాస్ పాల్గొని మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. మొక్కల ద్వారా ఆక్సిజన్ కొరత తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇకో క్లబ్ ఇన్‌చార్జి కె.జోత్స్న, ఉపాధ్యాయులు డి.శ్రీరాంమూర్తి, సి.హెచ్.చాందని, మనస్విని దాస్, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఇకో క్లబ్ ప్రతినిధులు

క్లుప్తంగా

ఇంత పెద్ద చేపా..!



భారీ చేపతో రంగారాయపురం గ్రామస్తుడు

సంతకవిటి: మండలంలోని నారాయణపురం ఆనకట్టలో 15 కేజీల బరువుండే భారీ చేప దొరికింది. తోటపల్లి జలాశయం నుంచి నీటిని దిగువకు విడిచి పెట్టడంతో పాటు వర్షాలు కురుస్తుండడంతో ఆనకట్టలోకి వరద నీరు పోటెత్తింది. దీంతో ఆనకట్టలో మత్స్యకారులు చేపల వేట కొనసాగిస్తున్నారు. శనివారం రాత్రి ఓ మత్స్యకారుడికి భారీ చేప దొరికింది. దీన్ని చూసేందుకు రంగారాయ పురం గ్రామస్తులు పరుగులు తీశారు.

చిన్నబగ్గ-గోరపాడు మధ్య ఏనుగులు



జీడితోటల్లో ఉన్న ఏనుగుల గుంపు

సీతంపేట: మండలంలోని చిన్నబగ్గ-గోరపాడు కొండల మధ్య ఏనుగులు సంచరిస్తున్నట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు. గడిచిన రెండు రోజులుగా గోరపాడు జీడితోటల్లో ఉన్న ఏనుగులు ఆదివారం ఉదయం చిన్నబగ్గ తోటల్లో సంచరిస్తూ కొండశిఖరానికి వెళ్లినట్టు ట్రాకర్లు గుర్తించారు. జీడి, మామిడితోటల కొమ్మలు, అక్కడక్కడ అరటి పంటను నాశనం చేస్తున్నాయని స్థానికులు తెలిపారు. ఎఫ్‌బీవో కె.దాలినాయుడుతో పాటు ట్రాకర్లు ఏనుగుల గమనాన్ని గుర్తించి తగు సూచనలిస్తున్నారు.

వీణ కచేరీతో బాలమురళికి నీరాజనం



వీణ కచేరీ చేస్తున్న డాక్టర్ నిష్ఠల కృష్ణవేణి

విజయనగరం టౌన్: ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయనగరంలోని ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో పద్మవిభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ 95వ జయంతి ఉత్సవంలో విశాఖకు చెందిన డాక్టర్ నిష్ఠల కృష్ణవేణి చేసిన వీణకచేరీ ఆహూతులను ఆకట్టుకుంది. ప్రముఖ మృదంగ విద్వాంసుడు, సంస్థ కార్యదర్శి డాక్టర్ మండపాక రవి మృదంగంపై సహకారం అందించి కచేరీని రక్తి కట్టించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, సభ్యులు బాలమురళి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించి, వారి జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో దూసి శివరాం శర్మ, టి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భగవతి చిన్నారులకు నంది, నాట్యమయూరి అవార్డులు



నంది, నాట్యమయూరి అవార్డులు అందుకున్న భగవతి చిన్నారులు

విజయనగరం టౌన్: విజయనగరంలోని భగవతి నృత్యకళామందిర్ చిన్నారులు నాట్యమయూరి అవార్డులు అందుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం నృత్యాలయ నాట్యకళా వెల్ఫేర్ అసోసియేషన్, సిరి ఆర్ట్స్ అకాడమీల ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణా బోనాల సంబరాలు, గురుపూజోత్సవంలో అద్భుతమైన ప్రదర్శన చేసి ఆహూతుల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా నంది, నాట్యమయూరి అవార్డులను కైవసం చేసుకున్నట్లు అకాడమీ డైరెక్టర్ వడ్లమాని రమణకుమారి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు అభిమానులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

కౌలు కార్డులు అందేనా..?

- కార్డుల పంపిణీ లక్ష్యం 16,250
- ఇంతవరకు ఇచ్చింది 10,700
- దరఖాస్తు చేసినా కార్డు రాకపోవడంతో ఎదురుచూపులు
- కార్డు లేక విత్తనాలు, ఎరువులు పొందలేకపోతున్న రైతులు



పొలం దున్నుతున్న రైతు

విజయనగరం ఫోర్ట్: ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు సిరపురపు రామునాయుడు. గంట్యాడ మండలం పెదవేమలి గ్రామానికి చెందిన ఈ రైతు విజయనగరం మండలం రాకోడు గ్రామంలో పొలం కౌలుకు చేస్తున్నాడు. కౌలు కార్డు కోసం 20 రోజుల క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. ఇంతవరకు కౌలు కార్డు ఇవ్వలేదు. దీంతో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం రాయితీపై అందించే విత్తనాలు పొందలేక పోయాడు. ప్రైవేట్ విత్తన దుకాణంలో కొనుగోలు చేసుకున్నాడు.

ఈ రైతే కాదు. అనేక మంది భూమిని కౌలుకు చేసుకున్న రైతులు కౌలు కార్డులు అందక ఇబ్బంది పడుతున్నారు. కౌలురైతులందరికీ కార్డులు ఇస్తున్నామని కూటమి సర్కార్ గొప్పలు చెబుతోంది కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. కౌలు కార్డులు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభమైనప్పటికీ ఇంకా పూర్తిస్థాయిలో కౌలు కార్డులు రైతులకు ఇవ్వలేదు. కార్డులు లేక పోవడం వల్ల ప్రభుత్వం రాయితీపై ఇచ్చే విత్తనాలు, ఎరువులు పొందలేక పోయారు.

ఈ ఏడాది కౌలు కార్డుల లక్ష్యం16,250

భూమిని కౌలుకు చేసే రైతులను గుర్తించి వారికి కార్డులను ఇస్తారు. 2025-26 సంవత్సరానికి గాని 16,250 మందికి కౌలు కార్డులు (సాగు హక్కు ధ్రువీకరణ పత్రాలు) అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇంతవరకు 10, 700 మందికి అందించారు. 5550 మందికి ఇంకా ఇవాల్సి ఉంది.

కార్డులు అందక నష్టపోతున్న రైతులు

కౌలు కార్డులు అందకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారు. భూమి ఉన్న రైతులు ప్రభుత్వం రాయితీపై అందించే విత్తనాలు, ఎరువులు వారి వన్‌బీ లేదా పట్టాదారు పాస్‌పుస్తకం పట్టుకుని వెళ్లి తెచ్చుకుంటారు. అదేవిధంగా పంటను కూడా విక్రయించుకుంటారు. భూమిని కౌలుకు చేసుకునే రైతులు కౌలు కార్డు పట్టుకుని విత్తనాలు, ఎరువులు తెచ్చుకుంటారు. అలాగే కౌలుకార్డు ద్వారా పండించిన పంటను కూడా విక్రయించుకోవడానికి అవకాశం ఉంటుంది. అయితే కౌలు కార్డులు లేక పోవడం వల్ల చాలా మంది కౌలు రైతులు ఈ ప్రయోజనాలు పొందలేకపోతున్నారు.



కౌలుకార్డు

త్వరలో ఇచ్చేందుకు చర్యలు

2025-26 సంవత్సరానికి సంబంధించి 16,250 మంది కౌలురైతులకు కార్డులు ఇవ్వాల ని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకు 10,750 మందికి అందజేశాం. మిగిలిన వారికి కూడా త్వరలో ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

23 నుంచి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

- మూడు రోజుల పాటు నిర్వహణ



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23,24,25 తేదీల్లో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలతో పాటు, రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ చైర్మన్, అధ్యక్షుడు కొండపల్లి అప్పలనాయుడు, ద్వారపురెడ్డి జగదీష్‌లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోటీల నిర్వహణకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న పోటీలు అండర్ -11,13,15, 17, 19 వయస్సుల విభాగాల్లో జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా ఈనెల 23న అండర్-19 విభాగంలో బాల, బాలికలకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో, 24న అండర్-15,17 వయస్సుల విభాగాల్లో, 25న అండర్-11, 13 వయస్సుల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ప్రవేశ రుసుము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆయా విభాగాల్లో జరిగే పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అదే రోజు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఏ కేటగిరీలోనైనా 6 జట్ల కన్నా తక్కువ జట్లు వస్తే చాంపియన్‌షిప్ నిర్వహించకుండా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక ప్రక్రియ మాత్రమే నిర్వహిస్తామని చెప్పారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9133773485, 79891 99534, 7981111705 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి నున్న సురేష్, ఎంకేబీ శ్రీనివాసరావు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

జనాభా దినోత్సవం సందర్భంగా చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

విజయనగరం అర్బన్: ఈ నెల 11న జరిగే జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి యూ.మాణిక్యం నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో పాల్గొన్నారు. జిల్లా పరిషత్/మున్సిపల్/ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు తొలుత ఈ నెల 7న మండలస్థాయిలో పోటీలు నిర్వహించాలని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. మండలస్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను ఈ నెల 9న జిల్లాస్థాయి పోటీలకు నగర పాలక ఉన్నత పాఠశాల, కంటోన్మెంట్‌లో హాజరుపరచాలని పేర్కొన్నారు. పొగాకు, మత్తు పదార్థాల వినియోగం, నివారణ అంశంపై చిత్రలేఖనం పోటీలు, లింగ సమానత్వం గౌరవ మర్యాదలు అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలని స్పష్టం చేశారు. కావున విద్యార్థులందరూ పోటీలో పాల్గొనేలా మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించి పాఠశాల, మండల జిల్లా స్థాయిల్లో జరిగే పోటీలు విజయవంతమయ్యేలా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి తెలియజేశారు.

టీచర్లపై బోధనేతర పనుల భారం తగ్గించాలి

- ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్



మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు బుఖారి బాబు

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయులపై అధికంగా మోపుతున్న బోధనేతర పనుల భారం తగ్గించాలని ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక సంఘం కార్యాలయం ఆవరణలో ఆదివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో పలు డిమాండ్లను సాధించాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బోధనపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలంటే బోధనేతర పనుల భారాన్ని తగ్గించాలని కోరారు. ఈ నెల 10న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కోసం లీప్ యాప్‌లో 'విట్‌నెస్' రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలని అధికారుల ఆదేశాలున్నాయని వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. యూనిఫారాలు, షూస్, బెల్టులు, పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం వంటి అంశాలపై కోడ్ నంబర్లతో అప్‌లోడ్ చేయాలన్న సూచనలు ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని వాపోయారు. యాప్‌ల భారాన్ని తగ్గిస్తామని చెబుతూ అన్ని పనులు ఒకే యాప్‌లో పెట్టడం వల్ల ప్రతి క్షణం ఉపాధ్యాయులకు పని భారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక భారం లేని అంశాలైన ఆప్షన్ హాలిడేల విషయంలో ఉపాధ్యాయుల అభిప్రాయాలను పట్టించుకోకుండా నిర్ణయాలు తీసుకుంటున్న విధానం ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచుతోందన్నారు. సంఘం అధ్యక్షుడు షేక్ బుఖారీ బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్తేరు శ్రీనివాస్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్ మోహన్ రావు, రాష్ట్ర అకడమిక్ సెల్ సభ్యుడు జేసీరాజు, జిల్లా గౌరవ అధ్యక్షుడు బంకురు జోగినాయుడు, జిల్లా సబ్‌కమిటీ సభ్యులు, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలి



ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లు విడుదల చేసిన దృశ్యం

- రవాణా రంగ డ్రైవర్లకు ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ పిలుపు

విజయనగరం గంటస్తంభం: డ్రైవర్ల మెడకు ఉరితాడు బిగించి, రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే మోటార్ వాహన చట్టం 2021,భారత న్యాయ సంహిత చట్టం 106(1,2)లను రద్దు చేయాలి. 10కోట్ల మంది రవాణా రంగ కార్మికులకు కేరళ తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటుతో పాటు ప్రభుత్వమే యాప్‌ను నడపాలి. లైసెన్స్, రెన్యువల్, రిజిస్ట్రేషన్, వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఆర్టీవో కార్యాలయం ద్వారా జరగాలి. అచ్యుతాపురంలో ఏర్పాటు చేసిన ప్రైవేట్ ఫిట్‌నెస్ సెంటర్లను రద్దు చేయాలి. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి. వాహన కొనుగోలుకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి. వాహన మిత్ర రూ.15000 తక్షణమే చెల్లించాలని కోరుతూ జూలై 9న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో రవాణా రంగ, ఓనర్లు, డ్రైవర్లు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు ఆదివారం జిల్లా పరిషత్ మినిస్టీరియల్ భవన్‌లోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎ.జగన్మోహన్ రావు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రవాణా రంగంపై పెద్ద ఎత్తున దాడి చేస్తోందన్నారు. ర్యాపిడో, ఉబర్, ఓలా వంటి సంస్థలను అనుమతించడంతో స్వయం ఉపాధిగా బతుకుతున్న ఆటో, టాక్సీ, మ్యాక్సీ క్యాబ్‌లకు బేరాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, సొంత వాహనాలను అమ్ముకోవడం లేదా ప్రైవేట్ సంస్థల యాప్‌లకు బందీలుగా మారిపోతున్నారని వాటిని రద్దుచేసి కేరళ తరహాలో ప్రభుత్వం యాప్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. రవాణా రంగాన్ని ఆదాయ వనరుగా కాకుండా సర్వీస్ రంగంగా గుర్తించి ప్రోత్సహించాలని, వారిపై వివిధ రూపాల్లో వేస్తున్న భారాలను తక్షణమే రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర రహదారుల్లో కూడా టోల్ గేట్లు ఏర్పాటు చేసి వాహనుదారులపై భారాలు వేస్తున్నారని మండిపడ్డారు.

గూడ్స్ కింద పడి వృద్ధుడి ఆత్మహత్య



సీతారామయ్య (ఫైల్)



ఆత్మహత్యకు పాల్పడిన సీతారామయ్య

కొత్తవలస: అనారోగ్య సమస్యల కారణంగా మనస్తాపం చెంది కొత్తవలస రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్‌కు ఎదురుగా వెళ్లి ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి గవర్నమెంట్ రైల్వే ఎస్సై బాలాజీరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా వేపగుంట సమీపంలోని సింహపురి కాలనీకి చెందిన చొప్ప సీతారామయ్య (78) తన కొడుకు వద్ద ఉంటున్నాడు. ఆయన భార్య నాలుగు సంవత్సరాల క్రితం మృతి చెందింది. దీంతో అప్పటి నుంచి ఆరోగ్య సమస్యలు వెంటాడడం మొదలయ్యాయి. ఆదివారం ఉదయం సింహపురి కాలనీ నుంచి బస్సులో కొత్తవసల వరకు వచ్చి జంక్షన్ నుంచి నేరుగా రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వెళ్లి ఎదురుగా వస్తున్న గూడ్స్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారం మేరకు జీఆర్‌పీ ఎస్సై సిబ్బందితో వచ్చి ఘటనా స్థలంలో పరిశీలించారు. మృతుడి చేతుల్లో సూసైడ్ నోట్ ఉండడాన్ని గమనించారు. అందులో తన చావుకు ఎవరూ కారణం కాదని, ఆరోగ్య సమస్యలను భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని రాసి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని విజయనగరం తరలించారు.

నేడు మడ్డువలస నీరు విడుదల

- చర్యలు చేపట్టిన అధికారులు



మడ్డువలస ప్రాజెక్టు

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు వద్ద సోమవారం మధ్యాహ్నం 3గంటలకు ఖరీఫ్ సీజన్‌కు సాగునీటిని విడిచిపెట్టనున్నట్లు ఏఈ నితిన్ తెలిపారు. రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ చేతుల మీదుగా స్విచ్ ఆన్ చేసి నీటి విడుదల చేపడతామని వెల్లడించారు.

ఆయకట్టు వివరాలు ఇలా..

ఈ ఏడాది ఆయకట్టు పరిధి ఆరు మండలాల్లో 30,077 ఎకరాలకు సాగునీటి సరఫరాను అధికారులు చేపట్టనున్నారు. వంగరలో 996 ఎకరాలు, రేగిడిలో 6777 ఎకరాలు, సంతకవిటిలో 10976 ఎకరాలు, జి.సిగడాంలో 6029 ఎకరాలు, పొందూరులో 99 ఎకరాలు, లావేరులో 5200 ఎకరాల ఆయకట్టు భూములకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాగునీటి విడుదల చేపట్టనున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

ప్రాజెక్టు పరిస్థితి ఇది..

మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు ద్వారా ఈ ఏడాది సాగునీటి విడుదల జాప్యమైందని చెప్పకతప్పదు. ఏటా జూన్ నెలలో నీటి విడుదల చేపట్టే పరిస్థితి ఉండేది. అయితే ఈ ఏడాది ప్రాజెక్టులో నీటి విడుదలకు సరిపడ నీరు నిల్వ ఉన్నప్పటికీ నీటిని విడుదల చేయడంలో అధికారుల అలసత్వంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నీటి సామర్థ్యం..

ప్రాజెక్టులో ఆదివారం 64.62 మీటర్ల లెవెల్‌లో నీటి మట్టం నమోదైంది. ఈ లెక్కన 3.008 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 65 మీటర్లు కాగా ఆ స్థాయికి 3.337 మీటర్లు నిల్వ ఉండాల్సి ఉంది. అయితే ఈ లెక్కన ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యానికి 00.34 మీటర్ల దూరంలో ఉంది. పుష్కలంగా ఆయకట్టుకు సాగునీరు విడుదలకు అవసరమైన నీరు నిల్వ ఉందని అధికారులు వెల్లడిస్తున్నారు.

యువకుడి అదృశ్యం



అదృశ్యమైన ప్రభాకర్

రామభద్రపురం: మండలంలోని కోటవిర్లాం గ్రామానికి చెందిన బప్పడాల ప్రభాకర్ (34) అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై వి. ప్రసాదరావు తెలిపారు. ఆ యువకుడు మతిస్థిమితం లేక ఎటో వెళ్లిపోతుండడం, మళ్లీ తిరిగి ఇంటికి వస్తుండడం చేస్తుంటాడు.గత నెల 25 వ తేదీన మధ్యాహ్నం ఇల్లు విడిచి వెళ్లిపోయాడు.కుటుంబ సభ్యులు ఇతర ప్రాంతాల్లో ఉన్న బంధువులకు ఫోన్‌లు చేసి వాకబు చేశారు. ఆదివారం వరకు ఇంటికి రాకపోవడంతో అతడి భార్య కుమారి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రభాకర్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

శివారు భూములకూ సాగునీరు

- రాష్ట్ర మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం: సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి ప్రాజెక్టు ద్వారా శివారు భూములకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ వద్ద సాగు నీటిని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి సమక్షంలో ఆమె ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కాలువ వద్ద పూజలను నిర్వహించి నదికి హారతులిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ ప్రాజెక్టు కోసం తమ భూములను త్యాగం చేసిన రైతులతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం జిల్లాల రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. జంఝావతి, కోటియా సమస్యలపై ఒడిశా ముఖ్యమంత్రితో చర్చించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. పూర్ణపాడు-లాభేసు వంతెన నిర్మాణం పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పార్వతీపురం సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ప్రాజెక్టుకు సంబంధించి భూ సమస్య పరిష్కారమైందన్నారు. రిజర్వాయర్ పరిసరాల్లో పర్యాటక అభివృద్ధికి చాలా అనుకూలంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉత్తర కోస్తా జల వనరుల శాఖ ఎస్ఈ కేవీఎన్ స్వర్ణకుమార్, ఈఈ హెచ్.మన్మధరావు, డీఈఈ బి.గోవిందరావు, టి.రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలి

- సిబ్బందికి ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలు



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: రోడ్డు ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ వకుల్ జిందల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. తద్వారా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుంచి రక్షణ పొంది, సురక్షితంగా గమ్యస్థానాలు చేరుకోవాలని హితవు పలికారు. ఏటా చాలామంది వాహనదారులు రహదారి ప్రమాదాల్లో హెల్మెట్ ధరించని కారణంతో మృతి చెందుతున్నారని ఎన్సీఆర్బీ నివేదికలో వెల్లడైందని చెప్పారు. వాహనాలు నడిపినపుడు ప్రతి వాహనదారు విధిగా నాణ్యత కలిగిన హెల్మెట్ ధరిస్తే, ప్రమాదానికి గురైనప్పటికీ స్వల్ప గాయాలతో ప్రాణాలను రక్షించుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్క వాహనదారు హెల్మెట్ ధరించే విధంగా చేయాలనే సంకల్పంతో జిల్లా పోలీసుశాఖ పని చేస్తుందని చెప్పారు. ప్రజలందరికీ హెల్మెట్ ధారణ పట్ల అవగాహన కల్పించి, వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. హెల్మెట్ ధరించని వాహనదారులపై ఎంవీ నిబంధనలు అతిక్రమించినట్లు పరిగణించి ఈచలానాలను విధించాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ప్రమాదాల నివారణలో పోలీసుశాఖకు సహకరించాలని ప్రజలకు ఎస్పీ వకల్ జిందల్ విజ్ఞప్తి చేశారు.

వివాహేతర సంబంధంతోనే ఆత్మహత్య?

- మృతుడి భార్య ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసులు



మృతుడు గౌరీ సత్యవరప్రసాద్



ఘటనా స్థలంలో డాగ్‌స్వాడ్‌తో పరిశీలిస్తున్న పోలీసులు

కొత్తవలస: వివాహేతర సంబంధం ఒక వ్యక్తి ఆత్మహత్యకు కారణమైంది. మండలంలోని కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధి ఉమాదేవికాలనీకి చెందిన గంగవరపు గౌరీసత్యవరప్రసాద్ (38) ఆదివారం అప్పన్నదొరపాలెం పంచాయతీ తమ్మన్నమెరక సమీపంలో గల మామిడితోటలో చెట్టుకు ఉరివేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తన భర్త మరణానికి తమ్మన్నమెరక గ్రామానికి చెందిన ఒక మహిళ కారణమంటూ మృతుడి భార్య ఎర్నెమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ షణ్ముఖరావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనకు సంబంధించి సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

వివాహేతర సంబంధం ఉన్న మహిళ వేధింపులు

గంట్యాడ మండలం లక్కిడాం గ్రామం నుంచి సుమారు 20 సంవత్సరాల క్రితం ఉమాదేవికాలనీకి కుటుంబంతో వలస వచ్చి ఇటుకల బట్టీ వ్యాపారం చేసుకుంటూ గౌరీ సత్యవరప్రసాద్ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య ఎర్నెమ్మ, కుమార్తె తోరణశ్రీ, కుమారుడు శ్యామ్‌సుందర్ ఉన్నారు. అదే ఇటుకల బట్టీలో పనిచేసే తమ్మన్నమెరక గ్రామానికి చెందిన మహిళతో సాన్నిహిత్యం గౌరీవరప్రసాద్‌కు ఉంది. దీంతో తన సంగతి తేల్చాలంటూ సదరు మహిళ తరచూ తన భర్తను బెదిరిస్తూ ఉండేదని మృతుడి భార్య ఎర్నెమ్మ తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సీఐ తెలిపారు. ఆదివారం కూడా సదరు మహిళ తన భర్తకు ఫోన్ చేసి నిలదీయడంతో చెంతనే గల మామిడి తోటలో ఒక చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. గౌరీ సత్యవరప్రాద్ ఉరివేసుకున్న విషయాన్ని సదరు మహిళ మృతుడి తమ్ముడికి ఫోన్ చేసి చెప్పింది. దీంతో మృతుడి భార్యతో పాలు కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి చూసేసరికి అప్పటికే మృతిచెంది విగత జీవిగా చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. ఉరివేసుకుని మృతి చెందాడా? లేదంటే ఎవరైనా హత్య చేసి చెట్టుకు వేలాడదీశారా ? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. దీంతో విజయనగరం నుంచి ప్రత్యేక క్లూస్‌టీమ్, డాగ్‌స్కాడ్ వచ్చి ఘటనా స్థలంలో పరిశీలించారు. మృతుడి భార్య ఎర్నెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చుసి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట సీహెచ్‌సీకి మృతదేహాన్ని తరలించారు.